# గొల్లపూడి కాలమ్

## మిత్రుడు కొమ్మూరి

తెలుగు దేశాన్ని శరత్  సాహిత్య  ప్రభావం ముంచెత్తుతున్న తరుణంలో– ఇటు తెలుగు వాతావరణాన్నీ, అటు శరత్ సాహిత్య హృదయాన్నీ అద్భుతంగా మేళవించి గొప్ప నవల రాశాడు కొమ్మూరి. అది అప్పటికీ, ఇప్పటికీ మైలురాయిగా నిలిచే

రచన మరొకటి లేదనిపించాడు.

నాకు 45 ఏళ్ళ మిత్రుడు. మనిషి తన పాత్రలంత సరళం. నాజూకయిన జీవన సరళి. ఆశలు అంతరిక్షంలో వున్నా వాస్తవాన్ని అవగాహన చేసుకొని నేల మీద నడిచే విచక్షణ గలవాడు. నాలాగ దూకుడుగా కాకుండా నెమ్మదిగా తనదయిన మార్గంలో ప్రయాణం చేసిన పథికుడు కొమ్మూరి.

సాహితీ ప్రపంచంలో అంత సన్నిహితుడు మరొకరిని చెప్పమంటే పురాణం పేరే చెప్తాను నేను. మేం ముగ్గురం కలిసి 'ఇడియట్' అనే నవల రాశాం. నిజానికి పురాణ రాయించాడు. అది అప్పటికీ, యిప్పటికీ  ఓ చక్కని ప్రయోగం అనుకొంటాను.

మాఇద్దరి స్నేహంలో నా జబ్బుల్ని కొన్నింటిని ఆయనకి అంటించాను.

నేనూ,కొమ్మూరి,వీరాజీ కలిసి ఉపన్యాసాలిస్తూ తిరిగిన సందర్భాలున్నాయి. కొమ్మూరి గొప్ప వక్త కాకపోయినా తన అభిప్రాయాన్ని,సిద్ధాంతాన్ని నిర్దుష్టంగా చెప్పగల చిత్త శుద్ధి గల రచయిత. ఎమెస్కో ఎమ్.ఎన్.రావుగారు నెల నెలా పుస్తక ప్రచురణ కార్యక్రమం ప్రారంభించినప్పుడు– మొదటి 5 పుస్తకాల విడతలో మేమిద్దరం వున్నాం. చాలా సంవత్సరాల తర్వాత నేను 'పిడికెడు ఆకాశం' రాశాను. చాలా సంవత్సరాలు గుర్తుంచుకొనే 'హౌస్‌సర్జన్' ఆతను రాశాడు. ఆ విడతలో మరో గొప్ప పేరు విశ్వనాథ సత్యనారాయణ గారు. ఆయన 'దిండు కింద పోకచెక్క' అనే అద్భుతమైన నవల రాశారు. చాలా సంవత్సరాల తర్వత నేను నేపాలు వెళ్ళినప్పుడు గాని ఆ పోకచెక్క స్వారస్యం అర్థమైందికాదు.

నేనెప్పుడు విజయవాడ వచ్చినా మొదటి ఫోన్ కొమ్మూరికే. ఎంత బిజీ కార్యక్రమంలో వున్నా వెలుచేసుకొని నాతో గడిపేవాడు. ఈ మధ్య విజయవాడ రేడియో స్టేషన్‌వారు 'రాగరాగిణి' నాటకాన్ని నా చేత చేయించినప్పుడు మూడు రోజులూ కలవలేక పోయాడు. ఆఖరి రోజు 'మీరు టిఫిన్ తినకండి.నేను బాబాయి హోటల్ మంచి పెసరట్లు తెస్తాను' అంటూ అరడజను పొట్లాలతో వచ్చాడు.

క్రితం సంవత్సరం విజయవాడ పుస్తక ప్రదర్శనకి నన్ను పిలిచినప్పుడు తన రేకీ పుస్తకాన్ని నన్ను విడుదల చేయమని ఫోన్ చేశాడు.సభలో 'వయస్సు మళ్ళిన వాళ్ళం మేం ఈనాటి తరానికి చెప్పే సలహా' అంటూ మాట్లాడాడు. నేను లేచి 'కొమ్మూరీ నేనూ సహచరులం. ఈ నాటి యువతరం అంటే నేను ఒప్పుకోను. మనిషి మేధస్సు పనిచేస్తున్నంత కాలం యువకుడే' అన్నాను. ఇంతలో వృద్ధాప్యం తోసుకువస్తుందని ఊహించలేకపోయాను.

మా అందరి కంటె ముందుగా ఓ స్థాయి, ఓవృత్తీ, కారూ, హోదాని సాధించిన అదృష్టవంతుడు కొమ్మూరి. ఆయనకి సినీమాలకి విరివిగా పనిచేయాలనే కోరిక మన్సులో వుండేది. నాకు ఆయనలాగ స్థిమితమయిన జీవనం గడపాలనే కోరిక వుండేది. అంత వత్తిడి వున్న జీవితంలో ఎప్పుడు కూర్చుని రాసేవాడో– అతి ముచ్చటయిన రచనలు ఆద్యంతమూ చేసిన రచయిత.

జీవితంలో అన్ని విషయాలూ, అన్ని దశలలోనూ అంత ఆప్యాయంగా విప్పి చెప్పుకొన్న ఆత్మీయుడు మరొకడు లేడు. మా ఇద్దరికీ హితవు చెప్పే మరొక మంచి మిత్రుడు మా నవభారత్ ప్రకాశరావుగారు. ఇద్దరినీ పోటీ గుర్రాళ్ళాగ రెచ్చగొట్టి రచనలు చేయించేవారు.

నా విజయవాడ జీవితాన్ని చిరస్మరణీయం చేసిన గొప్ప మిత్రుడు కొమ్మూరి,ప్రకాశరావు. ఓ రాత్రి పన్నెండు గంటలకి నేను సకుటుంబంగా సంబల్పూరు వెళ్తూంటే కొమ్మూరి కంటతడితో, ప్రకాసరావు అలిగి నిలబడడం గుర్తుంది.

కొమ్మూరి పోయాక– ఒక పాత్రికేయుడు ఫోన్ చేసి నా స్పందన అడిగినప్పుడు చెప్పాను. మా వాసూ పోయి నా వృద్ధాప్యాన్ని గుర్తు చేశాడు. మా కొమ్మూరి పోయాక వృద్ధాప్యం మీద పడినట్టనిపించింది.

'మనమున కెక్కినట్టి అభిమానులు మిత్రులు చెల్లినారు, ప్రాణధనంబు రాలిచి పోయె' అన్నారు దువ్వూరి.

సా హితీ ప్రపంచంలో నాతో పాటు కలిసి నడిచిన యిద్దరు 'ఇడియట్'లు శలవు తీసుకొన్నారు. ఇప్పుడు మొదటిసారిగా ఒంటరితనం భయపెడుతోంది.

-----------------

(రచయితని www.gollapudimaruthirao.com లో కలుసుకొన వచ్చును)